# 5

# బాధ్యత

"నువ్వు చెప్పిన టైముకన్నా ముందే వచ్చేసాను చూసావా సరూ? తొందరగా కాఫీ ఇచ్చేస్తే ఝూమ్మంటూ స్కూటరెక్కేయవచ్చును. ఇంతకీ ఏం సినిమాకు వెడుతున్నాం? నువ్వు రెడీ అయిపోయావా?' సరోజ ముఖ కవళికలు గమనించకుండానే గబగబ మాట్లాడేసాడు వినోద్.

మామూలుగా అయితే తనురాగానే ఎంతో సరదాగా కబుర్లు చెబుతూ, ఉత్సాహంగా వుంటే సరోజ ముభావంగా "కాఫీ తీసుకువస్తాను" అని లోపలికి వెళ్ళిపోయేసరికి విషయం ఏమిటో తెలియక నీరసంగా కూర్చుండిపోయాడు వినోద్.

'సరోజ సినిమాకు వెళ్ళాలని ముచ్చట పడిందని ఆఫీసులో పర్మిషన్‌పెట్టి ముందుగానే వచ్చాడు. క్రొత్త చీరె కూడా ఈ మధ్యనే కొనుక్కుంది. ఇక ఈ అలుకకు కారణమేమిటో? మనసులోనే మధనపడ్డాడు.

మూతి బిగించుకునే కాఫీ అందించిన సరోజను చూసి "అలా వున్నావేమిటోయ్? తలనొప్పిగా వుందా? లేక నువ్వు చూడాలనుకున్న సినిమా కాస్తా వెళ్ళిపోయిందా?" అనునయంగా అడిగాడు.

"ఆఁ! ఇక సినిమాలూ షికార్లూ మనకెక్కడికిలెండి!" విసురుగా అంటూ ఆ రోజు పోస్టులో వచ్చిన కవరు అతని ఒళ్ళోకి విసిరింది సరోజ. కవరు మీది అక్షరాలు చూడగానే అది తన తండ్రి నుండి వచ్చిన ఉత్తరమని గ్రహించాడు వినోద్. 'కవరు తెరిచి వుంది గనుక చదివిందన్నమాటే. సరోజకు అంత చిరాకు కలిగించే విషయం ఏం రాశారబ్బా? అనుకుంటూ కవరులో నుండి కాగితాలు బయటకు తీసి చదవసాగాడు.

*"నాన్నా వినోద్!*

*నువ్వు రాసిన జాబు చేరింది. మీ ఇద్దరూ కులాసాగా వున్నారని తెలిసి సంతోషపడ్డాము. నీకు తొందరలో ప్రమోషను రావొచ్చునని రాసావు. చాలా ఆనందం కలిగింది. మీ అమ్మ అయితే ఇరుగు పొరుగు వాళ్ళతో చెప్పి మురిసిపోతోంది. అన్నట్టు మీ అమ్మకు ఈ మధ్యన ఆరోగ్యం బాగుండటంలేదు. నీరసంగా వుంటోంది. నేనూ*

*పెద్దవాడినైపోయాను కదా! ఇంటా బయటా తిరిగి పనులు చేసుకునే ఓపిక వుండటంలేదు. నీ దగ్గరకు వచ్చేయమని చాలా రోజులుగా అడుగుతూనే వున్నావు. సరే ఈ వయసులో మేము ఒంటరిగా ఇక్కడ వుండడం మాకు కష్టంగానే వుంది. అంచేత ఇక్కడ మన ఇల్లు అద్దెకు ఇచ్చేసి మీ అమ్మా నేనూ నీదగ్గరికే వచ్చేయాలని నిశ్చయించుకున్నాం. మీ అన్నచూస్తే ఫారిన్‌లో వున్నాడు. మాకున్నది మీ ఇద్దరేకాదా! కోడలికి ఈ విషయం చెప్పి ఎప్పుడు రమ్మంటావోరాయి.*

*అమ్మాయికి మూడోనెల పడింది కదా! ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో. మీ ఇద్దరికీ ఆశీర్వచనాలు తెలుపమంటున్నది మీ అమ్మ 'నీ ఉత్తరం కోసం ఎదురు చూస్తుంటాను.*

ఇట్లు

**మీ నాన్న**

ఉత్తరం చదవడం ముగించి చిన్నగా నిట్టూర్చాడు వినోద్.

ఎదురుగా కుర్చీలో కూర్చుని ఏదో వారపత్రిక పేజీలు విసురుగా తిపుతున్నది సరోజ.

"నాన్నగారేం రాసారో చదివావా? నెమ్మదిగా అడిగాడు.

"చదివానని కనబడుతూనే వుందిగా!" విసురుగా వచ్చింది జవాబు.

"ఏమంటావు మరి?" క్షణం సందేహించి అడిగాడు.

"ఏమన్నా అనడానికి, చెప్పడానికి నేనెవర్ని? మీ అమ్మా నాన్నా మీ ఇంటికి వస్తుంటే మధ్యలో మాట్లాడడానికి నేనెవర్ని? నాకేం హక్కుంది? వుక్రోషంగా అంది సరోజ.

ఆ ధోరణి చూసి కొద్దిగా చిరాకనిపించినా తమాయించుకున్నాడు వినోద్.

"చూడు సరోజా! మొదటి విషయం ఏమంటే ఈ ఇల్లు నా ఒక్కడిదీకాదు. ఇది మన ఇల్లు, మన సంసారం. నీతో సంప్రదించనిదే, నీ అంగీకారం లేకుండా ఏ నిర్ణయమూ తీసుకోను. నీ మీద బలవంతంగా రుద్దను. రెండో విషయం ఏమంటే మా అమ్మా నాన్నా నీకు అత్తా మామా అని మరచిపోకు సరేనా? ఒకే. ఆ విషయం మళ్ళీ మాట్లాడుకుందాంగానీ ఇంతకీ సినిమాకు వెళ్తున్నామాలేదా?" విషయం మార్చి సరోజ మూడ్ మార్చాలని ప్రయత్నించాడు వినోద్.

"ఇంకేం వెడతాం? టైమయిపోయిందిలెండి. ఇక నా సరదాలన్నీ పక్కకు పెట్టాల్సిందే" దీర్ఘంగా నిట్టూర్చి లేచింది సరోజ.

* * *

మర్నాటి సాయంత్రం దాకా మళ్ళీ ఆ సంగతి గురించి మాట్లాడలేదు వినోద్.

సరోజ మంచి మూడ్‌లో వున్నపుడు నెమ్మదిగా అన్నాడు.

"ఇంతకీ అమ్మా నాన్నలకు ఏం రాయమంటావ్? వాళ్ళను స్టేషనుకు వెళ్ళి నువ్వే తీసుకురావాల్సి వుంటుంది. నాన్న హాల్లో ఈ దీవాన్ మీద పడుకుంటారనుకో. అమ్మకు ఒక మడత మంచం కొనుకొద్దామా?"

"పోనీ ఒకపని చేద్దాం' మన పడకగది వాళ్ళకి ఇచ్చేద్దాం. మీరు హాల్లో పడుకోండి. నేను వంటగదిలో సర్దుకుంటాను. ఇంత చిన్న ఇంట్లో నలుగురు మనుషులా తలచుకుంటేనే చిరాకుగా వుంది" వ్యంగ్యంగా అంది సరోజ

"అంటే నీ ఉద్దేశమేమిటి? ఇల్లు చిన్నదైతే మనవాళ్ళంటూ ఎవరూ రాకూడదన్నమాట. సరే! ఆమాటే వాళ్ళకు రాసేస్తాను. మీ కోడలికి మీరు వస్తే కష్టంగా వుంటుంది. రావొద్దండి అని చెప్పేస్తాను" అసహనంగా అన్నాడు.

"అయ్యోరామా! మీ వాళ్ళను రావొద్దని అనడానికి నేనెవర్నీ? మహారాజులా వచ్చి వుండమనండి. నేనెలాగూ ఈ నెలాఖర్న మా ఊరు వెళ్దామనుకుంటున్నాను. ఇక మీకుగానీ వాళ్ళకుగానీ ఏ ఇబ్బందీ వుండదు." అక్కసుగా జవాబిచ్చింది సరోజ.

"ఛ ఛ నీ ధోరణీ నీది గానీ విషయం అర్థం చేసుకుని సామరస్యంగా మాట్లాడ్డానికి ప్రయత్నం చేయవుకదా. నిన్ను మార్చడం నావల్లకాదనుకుంటా" కోపంగా అనేసి, లేచి బయటకు నడిచాడు వినోద్.

పదిరోజులు గడిచాయి. ముందు తమదగ్గరికి వచ్చి కొన్నాళ్ళు వుండి వాతావరణం అదీ నచ్చితే తరువాత అక్కడి ఇల్లు అద్దెకిచ్చేసి రావచ్చునని తండ్రికి ఉత్తరం రాసాడు వినోద్.

ఆ విషయమే సరోజకు చెప్పాడు. ఇక ఆ సంగతి గురించి మరేమీ మాట్లాడలేదు సరోజ.

నాలుగు రోజులయ్యేసరికి తామిద్దరూ బయల్దేరి వస్తున్నట్టు రాసారు వినోద్ తలితండ్రులు.

అత్తమామలు రాబోతున్నారని తెలియగానే తన ప్రయాణ సన్నాహం మొదలు పెట్టింది సరోజ.

"చూడు సరూ! మన పెళ్ళయ్యాక మొట్ట మొదటిసారిగా వాళ్ళు మనింటికి వస్తున్నారు. వాళ్ళు రావాలనుకుంటున్నారని తెలిసికూడా నువ్వు పుట్టింటికి వెళ్ళిపోయావని వింటే చాలా బాధపడతారు. ప్లీజ్.. నామాట కాదనక అమ్మా వాళ్ళు వచ్చాక, నాలుగురోజులు వుండి తరువాత మీ ఊరు వెళ్దువుగానీ.." అనునయంగా నచ్చచెప్పాడు వినోద్.

"అక్కడికి మన పెళ్ళయి ఎన్నో ఏళ్ళయినట్టుగా మాట్లాడుతున్నారే. ఇంకా కొత్త దంపతులు పెళ్ళయి ఏడాదయినా కాలేదు. వాళ్ళ అచ్చటా ముచ్చటకు అడ్డం రాకూడదు అని మీ అమ్మా నాన్నా అనుకోవాల్సిందసలు. సరేలెండి. మధ్యలో నాకెందుకు చెడ్డపేరు. అలాగే వాళ్ళు వచ్చాకే, వారి అనుమతి తీసుకునే వెళ్తాను. కానీ మళ్ళీ నేను వచ్చేది ఇంకో గది ఎక్కువ వుండే ఇంట్లోకి మారిన తరువాతనే అని గుర్తుంచుకోండి. మనకంటూ కాస్త ఏకాంతం దొరకని ఈ చిన్న ఇంట్లో అంతమందిమీ వుండటం నావల్లకాదు." ఖచ్చితంగా చెప్పింది సరోజ.

వినోద్ మాట్లాడకుండా వూరుకున్నాడు. వాదన పెంచడం వలన, మాటకు మాట అనుకోవడం వలన అనవసరమైన మనస్థాపం కలగడం ఒక్కటే కాక, అమ్మా

నాన్నా వచ్చేసరికి తామిద్దరం ఎడముఖం పెడముఖంగా వుండడం జరుగుతుందేమో అన్న ఆలోచనతో చాలా ఓర్పుగా సర్దుకుపోతున్నాడతను. అదీకాక నెలతప్పిన ముద్దుల భార్య మనసు నొప్పించడం ఇష్టంలేక సరోజ చిన్నతనం వలన అలా ప్రవర్తిస్తున్నదేగానీ మరేంకాదని సరిపెట్టుకుంటున్నాడు.

అత్తమామలు వచ్చి నాలుగురోజులు గడిచాక తన మనసులో మాట వాళ్ళకు చెప్పింది సరోజ.

మొదటిసారి తల్లికాబోతున్న ఆడపిల్ల తలితండ్రుల దగ్గర కొన్నాళ్ళు వుండి రావాలనుకోవడం సహజమైన ఆశగా తీసుకుని సరోజ ప్రయాణానికి అభ్యంతరం చెప్పలేదు అత్తమామలు. తాము రావడం వలననే కోడలు ఈ విధంగా వెళ్ళిపోతున్నదనిగానీ, భార్యా భర్తలిద్దరూ తమరాక గురించి ఘర్షణ పడ్డారని గానీ వాళ్ళకు ఆలోచనకూడా రాలేదు.

రైలు కదిలేముందు భార్యకు మరీ మరీ జాగ్రత్తలు చెప్పాడు వినోద్. “త్వరగా వచ్చేస్తావుగా సరూ.  నువ్వు దూరంగా వుంటే నాకు ఏమీ బాగుండదు” ప్రేమగా అన్నాడు.

“నేను లేకపోతే ఏంలెండి? మీ ప్రియమైన అమ్మా నాన్న మీ దగ్గరే వున్నారుగా! అయినా నేను రావాలంటే నాకు సౌకర్యంగా వుండే ఇంటికి మారండి.” పెడసరంగా జవాబిచ్చింది సరోజ.

వినోద్ దీర్ఘంగా నిట్టూర్చి వూరుకున్నాడు

* * *

సరోజ ఎక్కిన రైలు రెండు గంటలు ఆలస్యంగా ఊరు చేరింది.

డెబ్భై ఏళ్ళు దాటిన తండ్రి రాత్రి తొమ్మిది గంటలకే స్టేషనుకు వచ్చి అర్ధరాత్రిదాకా తనకోసం కాచుకుని కూర్చోవడంచూసి సరోజ మనసు చివుక్కుమంది.

ఇంటికి వచ్చిన తరువాత తెలిసింది తల్లికి నాలుగురోజులుగా జ్వరంగా వుందని.

అమ్మ ఆరోగ్యంగా కుదటబడేదాకా నాలుగు రోజులపాటు తానే వంటా వార్పు చూసుకుంది సరోజ.

‘కడుపుతో వున్న కూతురితో చాకిరీచేయించుకుంటున్నానని కన్నీళ్ళు పెట్టుకుంది సరోజ తల్లి.

ఆవిడ లేచి తిరగడం మొదలుపెట్టాక ఒకరోజున సరోజ ఇలా అంది.

“అదికాదే అమ్మా నీకు ఒంట్లో బాగాలేదంటే నాలుగురోజులు వదినను పంపించమని అన్నయ్యకు లెటర్ రాయకపోయావా? ఇద్దరు కొడుకులు మంచి ఉద్యోగాల్లో వున్నారు. ఎవరూ లేనట్టు ఈ వయసులో మీరిద్దరూ అవస్థలు పడటం ఏమిటి.”

“వాళ్ళ సంసారం, పిల్లలు, బాధ్యతలు వదిలి ఎవరు రాగలరే?” నిట్టూర్చి అంది తల్లి.

"బాగానేవుంది. కొడుకులన్నాక ఆమాత్రం బాధ్యత వుండొద్దూ? కష్టపడి పెంచి పెద్ద వాళ్ళను చేసి చదివించి వృద్ధిలోకి తెచ్చారు. ఇవాళ పెళ్ళయిీ అవగానే నా పెళ్ళాం పిల్లలూ అనుకోవడమేనా? మీ గురించి ఆలోచించవద్దూ?" కోపంగా అంది సరోజ.

"మీ చిన్నన్నయ్య అదేదో ట్రెయినింగుకని వెళ్ళాడట. చిన్న వదిన ఉద్యోగం చేస్తోంది కదా? ఇక మేము వెళ్ళి ఆవిడకు బరువు కావడందేనికి? సరే పెద్దన్నయ్య పిల్లలకు పరీక్షలట. వాళ్ళను వదలి మీ పెద్ద వదిన రాలేదు. మేం వెడితే పిల్లల చదువులకి ఇబ్బంది అవుతుంది. అందుకని మా తంటాలు మేం పడుతున్నాం" అన్నాడు సరోజ తండ్రి.

"సెభాష్ నాన్నా! చిన్నన్నయ్యకు తన ప్రమోషన్, భార్య సంపాదన ముఖ్యం. పెద్దన్నయ్యకు తన పిల్లల చదువులు బాగా సాగితే చాలు. అంతేగానీ వయసుమీదపడిన తలితండ్రులను చూసుకోవాలనే ప్రేమ, బాధ్యత ఎవరికీ లేవన్నమాట! చూసారా? కొడుకులు, కొడుకులు అని కలవరిస్తారు. ఇదిగో మగ పిల్లల నిర్వాకం, ఉద్ధరింపు ఇదే." ఆవేశంగా అంది సరోజ.

"పోనీలేవే.. వాళ్ళ ఇబ్బందులు వాళ్ళవి. మేము పూర్తిగా మంచాన పడలేదుగా, బండి ఎలాగో లాకొస్తున్నాం కదా!" వేదాంత ధోరణిలో అంది తల్లి.

"మీకు అంత ఖర్మేమిటమ్మా? వాళ్ళు చూడకపోతే నేను లేనూ? లక్షణంగా మా దగ్గరకు వచ్చేయండి. పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను. మీ అల్లుడు ఎంత మంచివాడో మీకు తెలుసుగా." అభిమానంగా అంది సరోజ.

"అంత ప్రేమగా పిలిచావు అంతేచాలు తల్లీ! కానీ నీ అత్తామామలను చూసుకునే బాధ్యత నీ భర్తమీద వుంది కదా! అన్నట్టు వాళ్ళు వస్తారని రాసావు. ఇంకా రాలేదా? వాళ్ళూ పాపం పెద్దవాళ్ళయిపోయారు." అంది సరోజ తల్లి.

అత్తమామల ప్రస్తావన వచ్చేసరికి సరోజ ముఖం పాలిపోయింది. గబుక్కున లేచి గదిలోకి వచ్చేసింది.

ఒంటరిగా పడుకున్న సరోజ మనసు ఆమెను నిలదీస్తోంది.

'బాధ్యతనూ ప్రేమనూ మరచిన అన్నయ్యలను విమర్శించిన తను వినోద్ తలిదండ్రుల విషయంలో ఎందుకలా ప్రవర్తించింది? పెళ్ళయ్యాక భార్యా పిల్లలే ముఖ్యమైపోయారని అన్నయ్యలను నిందించిందే తన అత్తా మామలను వినోద్ పట్టించుకోకూడదని ఎలా కోరుకుంది?' ఆత్మ పరిశీలనలో పడిన సరోజకు తన పొరబాటు అర్థమయ్యింది.

గురివింద గింజ చందంగా కాకుండా ముందు తన తప్పు తను దిద్దుకున్న తరువాతే ఎవరికైనా సలహాలు ఇవ్వగలిగే అధికారం వుంటుందని గ్రహించింది.

మర్నాడు ఉదయమే తండ్రి దగ్గరకు వచ్చింది సరోజ "నాన్నా! నేను రేపు వెళ్ళిపోతాను నేను వస్తున్నట్టు టెలిగ్రాం ఇవ్వండి మీ అల్లుడికి" అంది.

"అదేమిటమ్మా? వచ్చి పదిరోజులయినా కాకుండా తిరుగుప్రయాణం అంటావ్? ఏం ఆడపిల్లలో ఆ మూడు ముళ్ళూ పడితేచాలు. అందరికన్నా

కట్టుకున్నవాడే ఎక్కువయిపోతాడు." తల్లి నవ్వుతూ అంది.

"అది కాదమ్మా! పాపం మా అత్తయ్య మావయ్యా వచ్చారు. పాపం వాళ్ళే వండుకుని తిని ఏం అవస్థలు పడుతున్నారో! నేను మరో నాలుగు నెలల్లో ఎలాగూ మళ్ళీ వస్తానుగా! అప్పుడు నీ ఇష్టమొచ్చినన్నాళ్ళు వుంటాలే.!! నచ్చజెప్పింది సరోజ.

సరోజ రాక గురించి టెలిగ్రాం అందుకున్న వినోద్ ఇరకాటంలో పడ్డాడు. భార్య తనని వదలి వుండలేక వచ్చేస్తూందన్న ఆలోచన సంతోషం కలిగించినా ఆవిడ వచ్చాక ఏం సమస్యలు తలెత్తుతాయోనన్న దిగులూ పట్టుకుంది వినోద్‌కి.

సరోజ రాగానే అత్తమామలిద్దరినీ ఆప్యాయంగా పలకరించింది.

ఆ రాత్రి వినోద్ అన్నాడు" సరూ ఈ ఊళ్ళో ఇంకా పెద్ద ఇల్లంటే మనం అద్దె భరించలేము. అంచేత కొన్నాళ్ళు ఓపికపట్టు. అమ్మా నాన్నా ప్రస్తుతం ఇక్కడే వుండిపోయే ఉద్దేశ్యంతో రాలేదు గనుక కాస్త సర్దుకో ప్లీజ్.." అన్నాడు.

"అదేమిటండీ! మీ అమ్మా నాన్నా మీ దగ్గర కాక మరెక్కడో వుండటం దేనికీ? నేనేదో తెలియక మాట్లాడాను. మా ఊళ్ళో మా అమ్మా నాన్నా పడుతున్న అవస్థ చూస్తుంటే నాకు అర్థమయింది. ముసలి వాళ్ళయిన తలిదండ్రులను పిల్లలు చూడకపోతే ఎవరు చూస్తారు? వాళ్ళెంత కష్టపడి మిమ్మల్ని పెంచి పెద్దచేస్తేనే కదా మీరు ఈ రోజు మంచి స్థితిలో వున్నారు. మా అన్నయ్యలు అమ్మా నాన్నలను పట్టించుకోవడం లేదని బాధపడ్డాను. అందుకే మనస్ఫూర్తిగా చెప్తున్నా. అత్తయ్య మావయ్య మన దగ్గరే వుండనివ్వండి." అంది సరోజ.

"అందరు కోడళ్ళూ నీలాగే ఆలోచిస్తే ఎంత బాగుంటుంది సరూ? థ్యాంక్యూ అండ్ ఐ లవ్‌యూ" సంతోషంగా అన్నాడు వినోద్.

• A.I.R. Kurnool - 23-8-1996 •